క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నందిపేట్ (ఆర్మూర్): సీజనల్ వ్యాధులు, డెంగీ వ్యాధి విపరీతంగా ప్రబలుతున్న నేపథ్యంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఐలాపూర్, నందిపేటలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్, సీహెచ్‌వో దేవన్న, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్ సురేందర్, భాస్కర్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో..



బోధన్: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ఒకటో వార్డులో విష జ్వరాలు నమోదైన నేపథ్యంలో శిబిరాన్ని నిర్వహించి వైద్య సేవలు చేపట్టారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాలనీ వాసులకు సూచించారు. ఎడపల్లి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో భారీ వర్షాల కారణంగా శిథిలమైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు మరమ్మతులు చేపట్టడానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని బీజేపీ కౌన్సిలర్ జీవీ నర్సింహారెడ్డి మంగళవారం డిమాండ్ చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆర్మూర్ పర్యటన సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిధులు మంజూరు చేయాలని కోరారు. నేతలు పాలెపు రాజు, ఆకుల శ్రీనివాస్, ఉదయ్ ఉన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

రుద్రూర్: మండలంలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని రక్షిత ఆత్మహత్యపై ప్రభుత్వం, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. మంగళవారం రుద్రూర్‌లో ఆయన మాట్లాడారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని రక్షిత ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి భరోసా ఇవ్వాలన్నారు. నాయకులు గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

రుద్రూర్: పోతంగల్ చెక్‌పోస్టు వద్ద కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన హన్మంతు గైక్వాడ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి నాగనాథ్, ఎంఆర్‌పీఎస్ బాన్సువాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి పోచిరాం, ఉపాధ్యాయులు నాగయ్య,రాములు, సాయిలు, మాజీ సర్పంచ్ ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆర్మూర్: పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని కాలనీల్లో భారీ వర్షాల కార ణంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రాజుకు మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. బీజేపీ నాయకులు ఖాందేశ్ ప్రశాంత్, నారాయణ గౌడ్, నరేందర్ తదితరులున్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయండి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో వర్షాల కారణంగా కాలనీల్లోని రహదారులపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆర్మూర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో అధికారికి మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. నాయకులు మాదరి నరేష్, రమేష్, లక్ష్మీనర్సయ్య, కుంట మంగ తదితరులున్నారు.

ఆర్థిక సాయం



బోధన్: ఇటీవల సాలూర మండల కేంద్రంలోని వీకర్ సెక్షన్ కాలనీలో పోతుగంటి వీరయ్య గృహంలో ప్రమాదవశాత్తు వంట గ్యాస్ సిలిండర్ పేలిపోయి ఇల్లు పూర్తి దగ్ధమైంది. స్థానిక ముదిరాజ్ సంఘ సభ్యులు, యువకులు స్పందించి బాధిత కుటుంబానికి రూ.16 వేల 300 నగదు, 75 కిలో బియ్యం మంగళవారం అందించారు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని వారు కోరారు.

నిధులు గోల్‌మాల్!

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పడగల్ సొసైటీ మాజీ చైర్మన్
- నేడు విచారణకు రానున్న అధికారి



పడగల్ సొసైటీ

వేల్పూర్: పడగల్ సొసైటీలో భారీగా నిధుల గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. అక్రమాలపై సొసైటీ చట్టం–51 ప్రకారం సమగ్ర విచారణ జరిపించాలని మాజీ చైర్మన్ కొట్టాల చిన్నారెడ్డి గత నెలలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఫిర్యాదు చేశారు. సొసైటీ తరఫున ఇఫ్కో, క్రిభ్‌కో ఎరువుల కంపెనీల్లో 25 ఏళ్లకు ముందు డిపాజిట్ చేసిన రూ.40 లక్షల వాటాధనం మాయమైందని, దాంతో ఆ కంపెనీలు సొసైటీకి ఎరువులు సరాఫరా చేయడం లేదని, జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. వాటా ధనంపై ఎరువుల కంపెనీలు 20 శాతం డివిడెండ్ ఇస్తాయని, ఆ డివిడెండ్ నిధులకు కూడా లెక్కలేదని ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన విచారణ అధికారిని నియమించారు. సోమవారం ఆయన పడగల్ సొసైటీకి వచ్చి ప్రాథమికంగా విచారణ జరిపినట్లు సమాచారం. సమగ్ర విచారణ జరపాలంటే రికార్డులన్నీ తనకు ఈ నెల 4 వరకు సమర్పించాలని సొసైటీ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు.

ఎరువులు లభించకపోవడంతో..

సొసైటీలో రెండు దశాబ్దాల నుంచి నిధుల గోల్‌మాల్ జరుగుతోందని రైతులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. గతంలో ఎరువులు, మందులు పుష్కలంగా లభించేవి. గత ఐదేళ్ల నుంచి ఎరువులు లభించక పడగల్‌తో పాటు సొసైటీ పరిధిలోని అంక్సాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, పోచంపల్లి గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇఫ్కో, క్రిభ్‌కో ఎరువుల కంపెనీల్లో వాటాధనం లేకపోతేనే వారు ఎరువులు ఉద్దర ఇవ్వరని, ఎరువులు లభించడం లేదంటే ఎరువుల కంపెనీల్లో వాటాధనం మాయమైనట్లు స్పష్టంగా తెలుస్తోందని మాజీ చైర్మన్ వెల్లడించారు. రైతులకు పంట రుణాలు ఇచ్చినప్పుడు రుణం నుంచి సొసైటీకి వాటాధనం తీసుకుంటారని, ప్రస్తుతం సొసైటీలో ఒక్కరైతు వాటాధనం కూడా లేదని ఆయన ఆరోపిస్తున్నారు. అంతేగాక సొసైటీ సిబ్బంది తమ చాతుర్యం ప్రదర్శించి రైతుల పేరుపై పంట రుణాలు తీసుకున్న ఉదంతాలు బయటకు వస్తున్నాయి. పడగల్‌లో మాజీ సర్పంచ్ మీసాల రాజేశ్వర్‌రావు కుమారుడు రాహుల్ పంటరుణం తీసుకోనప్పటికీ ఆయన పేరుపై లక్షా 20 వేల పంట రుణం తీసుకున్నట్లు చూపుతున్నారని ఆయన అన్నారు. వీరే గాక అంక్సాపూర్‌కు చెందిన నేరెళ్ల చిన్న రాజేశ్వర్ ఇద్దరు కుమారులు రుణం తీసుకోకున్నా రూ.లక్ష చొప్పున పంటరుణాలు తీసుకున్నట్లు రికార్డుల్లో చూపుతున్నారని వాపోయారు. విచారణకు గతంలో కార్యదర్శిగా పనిచేసిన దయాసాగర్, ప్రస్తుత కార్యదర్శి మోహన్ ఏమేరకు సహకరిస్తారోనని రైతులు చర్చించుకుంటున్నారు.

కూలిన ఇళ్లు



మారంపల్లిలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): భారీ వర్షాలకు శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలుతున్నాయి. డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో సోమవారం ఒక నివాస గృహం దెబ్బతినగా, మంగళవారం మరో రెండు పెంకుటిళ్లలు కూలిపోయాయి. గొల్ల మల్లేశ్, గొర్రెపల్లి మల్లవ్వలకు చెందిన ఇళ్లు సగంమేర కూలిపోయాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి పంచనామా నిర్వహించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపినట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు.

జాన్కంపేట జీపీ పరిధిలో..



బోధన్: ఎడపల్లి మండలం జాన్కంపేట జీపీ పరిధి పరిధిలోని 14వ వార్డులో ఖురేషి హైమదీ బేగంనకు చెందిన పెంకుటిల్లు వర్షానికి కూలిపోయింది. ఇంట్లో సరుకులన్నీ పూర్తిగా తడిశాయని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

రుద్రూర్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో ఏడు ఇళ్లు దెబ్బతిన్నట్లు ఎంఆర్ఐ నజీర్ వెల్లడించారు. చిక్కడపల్లిలో ఆరు, సిద్దాపూర్‌లో ఒక ఇల్లు దెబ్బతిన్నాయి. అలాగే పోతంగల్ మండలంలోని హంగర్గఫారం, హెగ్డోలి, పోతంగల్, సుంకిని గ్రామాల్లో మంగళవారం ఆర్ఐ సాయిలు పర్యటించి వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ఉండవద్దని, స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని సూచించారు.



ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రహదారిపై కూలిన భారీ చెట్టు

నవీపేట: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని హనుమాన్ ఫారమ్ సమీపంలో రోడ్డు పక్కన గల భారీ చెట్టు నేలకూలింది. ఈ కారణంగా జన్నేపల్లి–నవీపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు, ఎంపీవో రామకృష్ణ, ఎస్సై వినయ్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును పక్కకు జరిపారు.

కాలువలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): చెరువుకు సంబంధించిన కాలువలు, శిఖం భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయన భీమ్‌గల్ పట్టణంలోని మొఘల్ చెరువు, అయ్యప్పనగర్ కాలనీలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొఘల్ చెరువు మాటు కాలువ కబ్జాకు గురికావడంతో అయ్యప్పనగర్ కాలనీ మొత్తం జలమయమైందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో పాటు కబ్జాకు గురైన భూములను వెలికి తీస్తామన్నారు. రాష్ట్ర సహకార సంఘ అసోషియేషన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి, పార్టీ నేత బొదిరె స్వామి తదితరులున్నారు.

కొనసాగుతున్న అలీసాగర్ వరద నీటి విడుదల



గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు

బోధన్: ఎడపల్లి మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్ వరద నీటి విడుదల రెండో రోజు మంగళవారం కొనసాగింది. భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి అలీసాగర్ రిజర్వాయర్ లోకి వరద నీరు చేరి పూర్తి స్థాయిలో నిండిపోగా, నీటిపారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా సోమవారం ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. మంగళవారం ఉదయం రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం తర్వాత రెండు గంటల పాటు నీటి విడుదల నిలిపివేశారు. సాయంత్రం మళ్లీ ఒక గేటు తెరిచారు. వరద నీరు చేరిక తగ్గుముఖ పట్టడంతో అధికారులు నీటి విడుదల విషయంలో జాగ్రత్తలు పాటించారు. నీటిపారుదల శాఖ ఈఈ సయ్యద్ మహ్మద్ జానీ, డీఈ లోక్య నాయక్‌లు నీటి విడుదలను పర్యవేక్షిస్తున్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక




ఎం హరికృష్ణ, అధ్యక్షుడు



మిద్దెల రాజు, ప్రధాన కార్యదర్శి



ఎస్ కృష్ణ మోహన్, కోశాధికారి



వై శ్రీనివాస్‌రావు, గౌరవ అధ్యక్షుడు

బోధన్: ప్రైవేట్ స్కూల్స్ అండ్ కాలేజ్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ బోధన్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులు సమావేశమై 2024–26 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అధ్యక్షుడిగా ముస్త్యాల హరిక్రిష్ణ(వివేకానంద హైస్కూల్, బోధన్), ప్రధాన కార్యదర్శిగా మిద్దెల రాజు(ప్రజ్ఞశ్రీ హైస్కూల్, సాలూర), ఎస్. కృష్ణమోహన్ (విజయ సాయి హైస్కూల్, బోధన్), గౌరవ అధ్యక్షుడిగా వై.శ్రీనివాస్‌రావు (విద్యా వికాస్ జూనియర్ కాలేజ్, బోధన్)లను ఎన్నుకున్నారు.

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కమిటీ

బోధన్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్ మంగళవారం తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రమేష్ బాబు, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా కవిత, అధ్యక్షుడిగా గైని రాములు ఉపాధ్యక్షులుగా గోపాల్, షేక్ నజీర్, సాయమ్మ, నాగమణి, సహాయ కార్యదర్శులుగా గోపాల్ గౌడ్, సింగాడి లక్ష్మణ్, భాను, లక్ష్మి, సభ్యులుగా శ్రీనివాస్, గంగారాం, జి.శ్రీనివాస్, రేఖ, రెడ్డి సాయిలు, పెంట సాయిలు, కుమార్, పల్లికొండ చింటూ, ఎల్లయ్యలను ఎన్నుకున్నారు.

ఎల్‌వోసీ అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కె.విజయకు కాంగ్రెస్ నేత పొద్దుటూరి వినయ్ రెడ్డి మంగళవారం రూ.2 లక్షల 50 వేల ఎల్‌వోసీ అందజేశారు. విజయ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వినయ్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా శస్త్ర చికిత్సలకు అయ్యే వ్యయాలను మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన ఎల్‌వోసీని బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె, వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రాయకూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై సాయన్న

రుద్రూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయన్న సూచించారు. సులేమాన్‌నగర్, చిక్కడపల్లి, రాణంపల్లి, సిద్ధాపూర్, రాయకూర్, రాయకూర్ క్యాంపు తదితర గ్రామాల్లో మంగళవారం ఎస్సై పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, చిన్న పిల్లలను పనుల నిమిత్తం బయటకు పంపవద్దని సూచించారు. ఇళ్లు శిథిలావస్థకు చేరితే అధికారులు స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని సూచించారు.

సంతమల్లన్నకు ప్రత్యేక పూజలు

వేల్పూర్: అంక్సాపూర్‌లో మంగళవారం సంతమల్లన్న స్వామికి శ్రావణమాసం పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో గ్రామస్తులు నెల రోజుల పాటు సంతమల్లన్న దీక్షలు పాటిస్తారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



బోధన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్(బోధన్): వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఏసీపీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు తమ మండపాల పేర్లను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయించాలన్నారు. సీఐ వీరయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, విద్యుత్ శాఖ డీఈ ముక్తార్, సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, ఎస్సై హబీబ్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

మాక్లూర్: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ సతీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రపత్ ఖాన్ గార్డెన్‌లో స్థానిక ఎస్సై రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన శాంతి కమిటీ సమావేశానికి సీఐ హాజరై మాట్లాడారు. ఘర్షణలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని, ఏ గ్రామంలో గణేష్ మండపాలు ఉన్నాయో తమకు తెలియపరచాలని సూచించారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



ఉమ్మెడలో ఎడ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నందిపేట్ (ఆర్మూర్): పలు గ్రామాలలో మంగళవారం రైతులు ఎడ్ల పొలాల అమావాస్య పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఎడ్లను అలంకరించి పూజలు నిర్వహించారు. మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేసి పూజలు చేసిన అనంతరం నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వేళ ఆలయాల చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణ చేస్తూ పూజలు చేశారు.

చిక్కడపల్లిలో..

రుద్రూర్: చిక్కడపల్లిలో మంగళవారం ఎడ్ల పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. మట్టి ఎడ్ల ప్రతిమలు చేసి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. యాంత్రీకరణ నేపథ్యంలో ఎడ్లు తగ్గిపోవడంతో సాయంత్రం వేళ ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు.

ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందొద్దు



మంజీర నది ఉధృతి, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ కారణంగా బిక్నెల్లి వద్ద నీట మునిగిన పంటలు



కందకుర్తి వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఆర్డీవో

- యంత్రాంగం అండగా ఉంటుంది
- నీట మునిగిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం
- బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్

బోధన్ రూరల్ : ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ సూచించారు. హంగర్గాలో రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కలిసి ఆర్డీవో మంగళవారం పర్యటించారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్, మంజీర నది ఉధృతి కారణంగా నీట మునిగిన పంటలను, ముంపు తీవ్రతను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ముంపు తీవ్రతను ముందుగానే అంచనా వేసి హంగర్గ నుంచి పలువురిని పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. వర్షాలు తగ్గేవరకు ముంపు ప్రాంతాల ప్రజలకు అధికార యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఖండ్‌గాం, భిక్నెల్లి, హంగర్గ శివారులో సుమారు 11 వందల ఎకరాల్లో సోయా నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ ద్వారా అంచనా వేయడం జరిగిందన్నారు. పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పునరావస కేంద్రాల్లో ఉంటున్న వారికి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ విఠల్, ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్, స్థానిక అధికారులు ఉన్నారు. హంగర్గలో మండల ప్రత్యేకాధికారి (డీపీవో) మంగళవారం సాయంత్రం పర్యటించి వరద, ముంపు తీవ్రతను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీ తదితరులు ఉన్నారు.

కందకుర్తి వద్ద వరద నీటి ప్రవాహం పరిశీలన

రెంజల్(బోధన్): భారీవర్షాలు కురుస్తున్నందున స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని..గోదావరి నది పరివాహక గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ సూచించారు. మంగళవారం కందకుర్తి వద్ద గోదావరి నదిలో వరదను పరిశీలించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని వదిలే అవకాశం ఉన్నందున నది వద్దకు రాకపోకలను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

నీట మునిగిన పంట పొలాలు



బోర్గాంలో పంటలను చూపుతున్న రైతులు

రెంజల్(బోధన్): భారీ వర్షాలకు రెంజల్ మొండి వాగు పరిధిలోని నీలా శివారుతో పాటు కందకుర్తి, బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాల్లో సుమారు 500 ఎకరాల వరకు సోయా, వరి పంటలు నీట మునిగాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు సకాలంలో గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేయకపోవడంతో ప్రతీ సంవత్సరం పంటలు నీట మునుగుతున్నాయని బోర్గాం గ్రామ రైతులు వాపోతున్నారు. మూడు రోజులుగా వరద నీటిలో పంటలు నీట మునగడంతో దిగుబడులపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవీపేట పరిధిలో..

నవీపేట: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి నది పొంగి ప్రవహిస్తోంది. మండలంలోని గోదావరి నది పరివాహక ప్రాంతాలైన కోస్లీ, మిట్టాపూర్ శివారులో 180 ఎకరాలలో వరి పంట నీట మునిగింది. చుట్టు పక్కల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

హైవేపైకి వరద నీరు




మాక్లూర్: భారీ వర్షాలకు మంగళవారం మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద 63వ నెంబర్ జాతీయ రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో కాంగ్రెస్ నేత రవిప్రకాశ్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో వరదనీరును దారి మళ్లించి నీరు రాకుండా చేశారు. ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ, స్థానిక ఎస్సై రాజశేఖర్‌లు కూడా తమవంతుగా పోలీసు సిబ్బందితో వచ్చి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

గేదెను కాపాడిన అధికారులు



బోధన్: ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ గ్రామ శివారులో ఉన్న అలీసాగర్ రిజర్వాయర్ కాలువ నీటిలో కొట్టుకు పోయిన గేదెను పోలీసు, ఇరిగేషన్ శాఖ అధికారులు కాపాడారు. మంగళవారం ఇదే గ్రామానికి చెందిన పశువుల కాపరి గేదెను మేత కోసం తీసుకురాగా కాలువ పడి కొట్టుకుపోయింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఇరిగేషన్ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం రిజర్వాయర్ రెండు గేట్లను గంట పాటు మూసివేశారు. దీంతో కొట్టుకుపోయిన గేదెను స్థానికుల సహకారంతో బయటకు తీసుకొచ్చారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	కావేరి (తెలుగు) - 10.50, 7.35, డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 1.10, 10. 40 స్త్రీట్-2 (తెలుగు) 10.40 తంగలాన్ (తెలుగు)- 04.15 అహ. విక్రమార్క (తెలుగు) - 7.35
స్క్రీన్-2 –	సరిపోదా శనివారం (తెలుగు)- 12.00, 3.35, 7.10, 10.45
స్క్రీన్-3 –	నేను కీర్తన (తెలుగు) - 12.00, కమిటీ కుర్రోళ్లు - 3.15, 9.35 ఆయ్ (తెలుగు) - 6.30
స్క్రీన్-4 –	సరిపోదా శనివారం- 11.00, 2.35, 6.10, 9.45

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతాఫిషియన్) నిజామాబాద్

స్క్రీన్-1	సరిపోదా శనివారం(తెలుగు) -10.10, 1.15, 4.20,7.30, 10.40
స్క్రీన్-2	గబ్బర్‌సింగ్(తెలుగు)-10.30,1.30 4.30,7.30,10.30
స్క్రీన్-3	తంగలాన్(తెలుగు)-11.50 సరిపోతు శనివారం(తెలుగు)-3.10 6.45,10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	స్త్రీ-2(హిందీ)-12.15,3.30,6.45 గబ్బర్‌సింగ్(తెలుగు)-10.20
స్క్రీన్-2	స్త్రీ-2(హిందీ)-12.00,3.15,6.30, 9.45
స్క్రీన్-3	కాలం రాసిన కథలు(తెలుగు)-10.05 కమిటీకుర్రోళ్లు(తెలుగు)--1.10 నేను కీర్తన(తెలుగు)-4.25 ఆయ్(తెలుగు)-7.40 స్త్రీ-2(హిందీ)-10.45
స్క్రీన్ -4	సీతారాం సీత్రాలు(తెలుగు)-9.40 సరిపోదా శనివారం(తెలుగు)-12.30 తంగలాన్(తెలుగు)-4.05 డిమోంటీకాలనీ-2(తెలుగు)-7.25,10.35
లలితామహాల్	సరిపోదా శనివారం(తెలుగు)
దేవి	తంగలాన్(తెలుగు)-11.00,2.15,6.00 గబ్బర్‌సింగ్(తెలుగు)- 9.15 (రాత్రి)
నటరాజ్	గబ్బర్‌సింగ్(తెలుగు)
విజయ్	గబ్బర్‌సింగ్(తెలుగు)-11.00, 2.15, 6.00 -మిస్టర్ బచ్చన్(తెలుగు)-9.00

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,400	వెండి (కిలో)	90,200
22 క్యారెట్స్	68,635		

– నిజామాబాద్ బిజినెస్